

నేడు ఎమ్మెల్యే ఆఫీసులో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ స్థానిక లక్ష్మీ నగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో 27వ తేదీ శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జత చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

వార్డు కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను చిత్తూరు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ఈనెల 30వ తేదీ లోపల పారదర్శకంగా ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పూర్తిచేయాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలు, మదనపల్లి, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగిరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఈనెల 27, 28 తేదీల్లో బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. 27వ తేదీ 10.30 గంటల నుంచి వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలకు కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు కౌన్సిలింగ్ నిర్వహణకు సిబ్బందిని కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం మామిడి రైతులకు భరోసా ఇవ్వాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేయని యాజమాన్యం మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కేవలం రెండు రూపాయలు మాత్రమే ఇస్తానని చెప్పడంతో ఆవేదనతో తవణంపల్లిలో రైతు రోడ్డుపై మామిడికాయలు పోసి నిరసన చేయడం జరిగిందని, అయితే వీడియోలు తీసి అతన్ని బెదిరించే పనిచేయడం దారుణమని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ తవణంపల్లి మండలంలో ర్యాంపు వద్ద మామిడి రైతు ధర లేక బాధతో మామిడికాయలు రోడ్డుపై పక్కనే పారబోశాడని, దీన్ని కొంతమంది సోషల్ మీడియాలో పెట్టడంతో అధికార పార్టీ నాయకులు, పోలీసులు అతన్ని బెదిరించే కార్యక్రమం చేయడం దారుణమన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా రైతులు బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. 29న సీఎం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా చిత్తూరు జిల్లాలో మామిడి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చే విధంగా ప్రకటన చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులను బెదిరించే వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుంటున్నప్పటికీ కింది స్థాయిలో ఏమాత్రం లెక్కచేయడం లేదన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం ఎందుకు ప్రేమ చూపుతున్నదో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మామిడి రైతులకు అండగా నిలబడాలన్నారు. ఫ్యాక్టరీల వద్ద పడికాపులుకాస్తున్న వారికి భోజనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు రూ.4లు సబ్సిడీ అందేలా చూడాలి..

రోజూ ర్యాంపుల వద్ద మామిడి అమ్మకంపై నివేదికలు సమర్పించండి: కలెక్టర్



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు): తోతాపురి మామిడి రైతులను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.4ల ఆర్థిక సహాయంను రైతులకు అందేలా చూడాలని మండల అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు, తహశీల్దార్లు చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మామిడి అమ్మకం, ప్రభుత్వ సబ్సిడీ వివరాలపై గురువారం ఆర్‌డిఓలు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం, పలమనేరు నియోజకవర్గాలలో గతంలో పండే దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల మామిడిని వ్యాపారవేత్తలు నేరుగా మామిడి తోటలకే వెళ్ళి కొనుగోలు చేసే వారని, ప్రస్తుతం ర్యాంప్‌ల వద్ద కొనుగోలు తగ్గిందన్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలలో మామిడి గుజ్జు పరిశ్రమలు లేవని, ఈ కారణంగా జిల్లాలోని ఇతర మామిడి గుజ్జు పరిశ్రమల వద్దకు రైతులు పోటెత్తుతున్నారన్నారు. మామిడి కాయల దిగుబడి పెరిగి డిమాండ్ తగ్గడంతో మార్కెట్‌లో మామిడి కాయల ధర తగ్గిందన్నారు. ప్రస్తుత పరిస్థితి కారణంగా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు అండగా మార్కెట్ ధరకు అదనంగా రూ.4లను రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. మండలాలలో గల ర్యాంప్‌లను మండల వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అసిస్టెంట్లు సందర్శించాలన్నారు. షిఫ్ట్‌ల ప్రకారం పనిచేసే సిబ్బంది ర్యాంప్‌ల వద్ద రైతులు జరుపుతున్న అమ్మకం వివరాలను నిర్దేశించిన ప్రోఫార్మాలలో పూరించి కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. తోతాపురి మామిడి రైతులకు ప్రభుత్వం అందించనున్న రూ.4ల సబ్సిడీని సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే రూ.4ల సబ్సిడీ పొందడానికి రైతులు మామిడి కాయలను కోసిన తరువాత గుజ్జు పరిశ్రమలకు, మండీలకు, ర్యాంపులకు తరలిస్తే గుజ్జు పరిశ్రమలు, మండీలు, ర్యాంపుల వద్ద నియమించిన అధికారులకు రైతు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలను ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. రైతు స్వయంగా మామిడి తోట నుండి నేరుగా తమ పంటను వేరే రాష్ట్రాలకు సరఫరా చేసినా కూడా వివరాలను రైతుసేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమాచారంను విలేజ్ అగ్రికల్చర్, హార్టి కల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

5న కృత్రిమ అవయవ క్యాంప్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలోని విభిన్నప్రతిభావంతులకు జులై 5వ తేదీ శనివారం విశాల్ మార్ట్ పక్కనున్న తపోవనంలో కృత్రిమ కాలు క్యాంప్ నిర్వహించి కావల్సిన వారి కొలతలు తీసుకొవడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి సోహెల్ అబ్బాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇదివరకు కృత్రిమ కాలు తీసుకున్న లబ్ధిదారులు ఈ క్యాంపుకు రావలసిన అవసరం లేదని, ఇంతకు ముందు తీసుకోని వారు, కొత్తగా కృత్రిమ కాలు కావలసిన వారు ఈ క్యాంపుకు హాజరవ్వాలని తెలిపారు. మళ్లీ 20 రోజుల తరువాత ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాలు ఉచితంగా అమర్చబడుతుందని తెలిపారు. ఇతర వివరాల కోసం రాజశేఖర్ నాయుడు 94403 57522 సంప్రదించాలని పేర్కొన్నారు.

పిఎం జెడివై పై అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రధాన మంత్రి జన్ ధన్ యోజనకు సంబంధించి గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయం నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా పిఎంజెడివై పథకంపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంజెడివై పేదలను ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి తీసుకువస్తోందని, అణగారిన వర్గాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగంగా, సజావుగా పారదర్శకంగా బదిలీ చేయడానికి, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. గతంలో బ్యాంకు సేవలు అందుబాటులో లేని వారికి బ్యాంకు ఖాతాలు, చిన్న పొదుపు పథకాలు, బీమా, క్రెడిట్ వంటి సార్వత్రిక, సరసమైన, అధికారిక ఆర్థిక సేవలను అందించడం ద్వారా, పిఎం జన్ ధన్ యోజన గత దశాబ్దంలో దేశ బ్యాంకింగ్, ఆర్థిక దృశ్యాన్ని మార్చి వేసింది పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ ద్వారా మూడు నెలల జన సురక్ష యోజన పథకం జూలై ఒకటో తేదీ నుండి సెప్టెంబర్ 30 వరకూ జరగనుందని, ఈ కార్యక్రమంలో అన్ని బ్యాంకులు భాగస్వాములుగా ఉంటున్నట్లు తెలిపారు. కనుక ప్రతి బ్యాంకు శాఖకు కొన్ని గ్రామ పంచాయతీలు కేటాయించటం జరుగుతుందని, ఆ గ్రామ పంచాయతీలలో నిర్దేశించిన తేదీలో జన సురక్ష గ్రామసభలో నిర్వహించాలని తెలిపారు. గ్రామ సభలలో జన్ ధన్ ఖాతాలు, కొత్త జన్ ధన్ ఖాతాలు తెరవడం, అర్హులందరికీ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష భీమా యోజన సౌకర్యం కల్పించటం, అటల్ పెన్షన్ యోజన నమోదు చేయించటం, పంచాయతీ శాఖలను బ్యాంకులతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ద్వామా పీడీ రవికుమార్, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, ఎల్‌డిఎం హరీష్ కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది



నిరసన

ప్రజాశక్తి- విజయపురం (నగరి): తమ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన నాల్గవ రోజుకు చేరుకుంది. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించిన వారు తమ సమస్యలను ప్లకార్డు రూపంలో ప్రదర్శిస్తూ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు గూగుల్ వైస్ ప్రెసిడెంట్ తోట చంద్రశేఖర్ గురువారం కోటి రూపాయల విరాళం ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును తిరుమలలోని ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో కలిసి విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు. అనంతరం ఆలయాధికారులు వారికి దర్శన ఏర్పాటు చేసి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం: కలెక్టర్



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం గాంధీ విగ్రహం సర్కిల్, దర్గా సర్కిల్, చర్చివీధి నుండి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారిని మొక్కగా ఉన్నప్పుడే తుంచేసే ఉద్దేశంతో విద్యార్థులకు యువకులకు అవగాహన కల్పించి డ్రగ్స్ భారిన పడకుండా చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ భారిన పడి చాలా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, వేల మంది జీవితాలు నాశనం అవుతున్నాయిని, ఆర్థికంగా వెనకబడడం జరుగుతున్నదని తెలిపారు. కొంతమంది విద్యార్థులు తెలిసి తెలియని వయసులో డ్రగ్స్ భారీన పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాదకద్రవ్యాలను ఉపయోగించడం వలన సమాజానికి, మనకు మన భవిష్యత్తు తరాల వారికి, విద్యార్థులకు ఎంత ప్రమాదకరం తెలియజేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మాదకద్రవ్యాలు మనకు కనపడకుండా మన చుట్టూ చేరి మన కుటుంబాన్ని మన భవిష్యత్తును నాశనం చేస్తాయని అన్నారు. ఇందుకోసం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయడంలో భాగంగా ప్రతి కళాశాల యాజమాన్యం వారి కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు యువతకు అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం రవాణా చేయడంపై గత సంవత్సరం చిత్తూరు జిల్లాలోనే మొత్తంగా 240 పైగా కేసులు పెట్టి 1440 కేజీల మాదాక ద్రవ్యాలను సీజ్ చేయడం, 740 మందిని కూడా అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించిన, అమ్మిన, నిల్వ ఉంచిన, రవాణా చేసిన నేరంగా పరిగణించబడుతుందని దీనికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి భారతి, నగరపాలక మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, అడిషనల్ ఎస్‌పి నందకిషోర్, ఎక్సైజ్ ఏఎస్‌పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

విజయపురం (నగరి): మాదకద్రవ్యాలను యువత, విద్యార్థులు వాడకూడదని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలుపై యువతకు అవగాహన కల్పిస్తూ నగరి పట్టణ పరిధిలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత అవగాహన లోపంతో చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారని, గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం అత్యంత ప్రమాదకరమని అన్నారు. దురలవాట్లు మీ జీవితాలతో పాటు మీ పై ఆధారపడే కుటుంబాలను సైతం నాశనం చేస్తాయని చెప్పారు. సీఐ విక్రమ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎస్ఐలు, పోలీసులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నగరిలో..

కుప్పం రూరల్ : మాదకద్రవ్యాలకు నేటి యువత దూరంగా ఉండవలసిన అవసరం ఉందని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి చిదంబరం సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.రాజ్యలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ సుదర్శనం, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్..

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- రామకుప్పం మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన ననియాల పరిసరాల్లోని పంట పొలాలపై ఒంటరి ఏనుగు హల్‌చల్ చేస్తుండగా.. .ప్రజలు బేంబేలెత్తిపోతున్నారు. గత మూడు రోజులుగా మామిడి, వరి పంటలతో పాటు వ్యవసాయ పరికరాలను కూడా ఒంటరి ఏనుగు తొక్కినాశనం చేసింది. బుధవారం రాత్రి ననియాల గ్రామసమీపంలో చంద్రమోహన్ అనే రైతుకు చెందిన ఆవుల షెడ్డు గోడను పాక్షికంగా దెబ్బతీసింది. అదే సమయంలో చంద్రమోహన్ భార్య బయటకు వెళ్లింది. ఆమెను గమనించిన ఒంటరి ఏనుగు ఆమె వైపు దూసుకు వెళ్ళింది. దీంతో ఆమె పరుగులు తీసి గ్రామానికి చేరుకుంది. ఏనుగు అరుపులకు భయాందోళన గురైన చంద్రమోహన్ షెడ్‌లోనే దాక్కొని ఉండిపోవడంతో బతికిపోయాడు. ఏనుగు అక్కడ నుంచి వెళ్లిన తర్వాత గ్రామానికి చేరుకున్నాడు. అదేవిధంగా బెంగళూరప్ప, శంకరప్ప, నాగరాజుకు చెందిన మామిడి తోట, వరి పొలాలపై దాడులు చేసింది. అటవీ అధికారులు, ట్రాకర్లు ఏనుగును అటవీలోకి తరిమెందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అడవిలోకి వెళ్లినట్టే వెళ్లి తిరిగి పంట పొలాల వైపు వస్తుంది. ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని భాధితులు కోరుతున్నారు.



ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన షెడ్డు

ప్రజలకు అటవీ శాఖ వారి హెచ్చరిక


ప్రజాశక్తి- రొంపిచర్ల పులిచెర్ల మండలం దేవలంపేట, పాళ్యం పంచాయతీ సరిహద్దుల్లో ఉన్న చింతలవంక రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో ఉన్న 14 ఏనుగుల గుంపుకు తోడుగా గురువారం ఉదయం మరో 3 ఏనుగులు వచ్చాయని ఇప్పుడు మొత్తం 17 ఏనుగులు అడవిలో సంచరిస్తున్నాయని తెలిపారు. కాబట్టి అటవీప్రాంతం సరిహద్దుల్లో ఉన్న కోటపల్లె, దేవళంపేట, గండివారిపల్లి, మాదిగపల్లి వంకాయలవారిపల్లి, కమ్మపల్లి, గంటావారిపల్లి దిగువ మూర్తివారిపల్లి గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అటవీ సరిహద్దు ప్రాంతంలో ఉన్న పంట పొలాల్లో రైతులు రాత్రి వేళల్లో బస చేయరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాత్రి సమయంలో ప్రయాణించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. తెల్లని దుస్తులు ధరించి అటవీ సమీపంలో తిరగవద్దు అని సూచించారు. ఏనుగులు గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఈ నంబర్లుకి 82477 45101, 79895 77256, 9618 918081 తెలియజేయాలని అటవీశాఖ అధికారులు కోరారు.

ప్రజాభిప్రాయంతో కుప్పం పార్కు అభివృద్ధి



ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని పార్క్‌ను ప్రజాభిప్రాయానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తామంటూ కడా అధికారులు తెలిపారు. పార్కు అభివృద్ధిపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని పార్కు ఆవరణలో నిర్వహించారు. కడా తరపున పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు నిర్వహించిన కార్యక్రమానికి కడ కమిటీ సభ్యులు పిఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు, టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు పార్కు అభివృద్ధి పై తమ అభిప్రాయాలను తెలియజేశారు. కడా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజాభిప్రాయానికి విలువ ఇస్తారని, అదే స్ఫూర్తితో పట్టణ పార్క్ అభివృద్ధికి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరి సూచనను పరిగణలోనికి తీసుకుని, పార్క్‌ను ప్రజలకు అనుకూలంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతామన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా పార్కును అభివృద్ధి చేస్తామని తెలిపారు. పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజారామ్ పాల్గొన్నారు.

యువకుడి మరణంపై అధికారుల విచారణ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం వడ్డేపల్లి ప్రాంతంలో చోటు చేసుకున్న ప్రమాదంలో యువకుడి ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి విధితమే. ఈ ఘటనపై మైనింగ్ అధికారులు స్థానిక ఎమ్మార్వో చిట్టిబాబుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి, యువకుడి మరణంపై విచారించారు. కాగా ప్రాణం కోల్పోయిన యువకుడు పాపానూరు గ్రామానికి చెందిన రాజాగా తెలిపారు. విచారణ అనంతరం పంచనామా చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, వారి ఆదేశాల మేరకు దోషులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ వేణుగోపాల్, మైనింగ్ ఆర్ఐ, స్థానిక వీఆర్వో పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చిన ప్రజలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో హైరోడ్డు విస్తరణలో భాగంగా గురువారం కట్టమంచి ఎంఆర్ఎఫ్ టైర్ షోరూమ్ పక్కన ఉన్న ప్రైవేటు స్థలం భవన యజమాని ఒప్పించి అతని అంగీకారంతో 100 అడుగుల కావలసిన స్థలాన్ని జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది. దీన్ని ఉద్దేశిస్తూ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర మాట్లాడుతూ హైరోడ్డు విస్తరణకు ప్రజల సహకరించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. అలాగే హైరోడ్డు విస్తరణకు సహకరించిన పి.జయచంద్ర రెడ్డి తను కోల్పోయిన భూమికి టీడీఆర్ బాండ్ రూపంలో ప్రభుత్వం నుంచి అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లాన్ సూపర్వైజర్, టీబీపీవోలు, ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: పశు వైద్యాధికారిణి చందన ప్రియ ఆధ్వర్యంలో సోమల మండలంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మందు మండలంలోని 23,300 గొర్రెలు, మేకలకు ఈ నెల 26వ తేదీ నుండి జులై 10వ తేదీ వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. గొర్రెలు, మేకలు, చెరువుల వద్ద , నీటి కుంటల వద్ద మేత మేయడం వల్ల కడుపులో పురుగులు చేరి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని దీని నివారణకు నట్టల నివారణ మందును తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వెదురుకుప్పంలో

వెదురుకుప్పం: పశుసంవర్ధ క శాఖ సహాయ సంచాల కులు డాక్టర్ రూప సుందరి ఆధ్వర్యంలో నట్టల నివార ణ మందు పంపిణీని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడు తూ మండలంలోని 44,500 గొర్రెలు, మేకలకు ఈ మందు పంపిణీ చేస్తామని తెలిపారు. అన్ని పశు వైద్య కేంద్రాల్లో ఈ మందు అందుబాటులో వుంటుందని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ అందించి తమ జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందును తాగించాలని సూచించారు. చవటగుంట గ్రామంలో ప్రారంభించిన నట్టల నివారణ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా పుత్తూరు ఉప సంచాలకులు డాక్టర్ గోవిందయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ రాజేష్, పశువైద్య సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యుడిగా డాక్టర్ ప్రవీణ్


బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ ప్రవీణ్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్‌గా నియమితులైన ప్రవీణ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన చిత్తూరు డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. బదిలీపై తూగుండ్రం ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఆరోగ్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల నమోదు వేగవంతం

ప్రజాశక్తి-సోమల:
సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఆర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది పాఠశాల పరిధిలోని పది సంవత్సరాలు లోపు వయసు వున్న పిల్లలను గుర్తించి పాఠశాలలో నమోదు చేయించే ప్రక్రియను గురువారం వేగవంతం చేశారు. ఆ పాఠశాల పరిధిలోని నెలుకూరి వారి పల్లి, కోళ్లఫారం, పాయలగుట్ట గ్రామాలకు వెళ్లి ఆరు సంవత్సరాలు పైబడి పదేళ్ల లోపు వున్న వారిని వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదు చేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఛైర్మన్ కన్నయ్య, ఉపాధ్యాయురాలు చంద్రకళ, మధుమతి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కుక్కల బెడదకు పరిష్కారం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:
కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి ఆసిఫ్ పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన 'కుక్క కాటు ఆగేది ఎప్పుడు?' వార్తకు స్పందించి బంగారుపాళ్యం మండల కేంద్రం మేదర్ వీధి తగ్గువారిపల్లి పంచాయతీలలో క్షేత్ర స్థాయిలో గురువారం వారు పరిశీలించారు. వార్తలో వచ్చిన విధంగా కుక్కలు అధిక సంఖ్యలో వున్నాయని వాటి నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాటి సంతాన ఉత్పత్తి నిరోధానికి వాటికి తగిన శస్త్ర చికిత్స చేయనున్నట్టు పశువైద్యాధికారి ఆసిఫ్ తెలిపారు.

కరకమంద వాసికి డెంగీ లక్షణాలు?

- గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో, వైద్య సిబ్బంది
- లార్వా గుర్తింపు - పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచన

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ కరకమంద గ్రామంలో ఓ మహిళకు డెంగీ లక్షణాలు ఉన్నాయని మండల వైద్య శాఖకు జిల్లా కేంద్రం నుంచి సమాచారం అందడంతో సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఎంపీడీవో నారాయణ, ఈవోఆర్‌డి లక్ష్మీదేవి కరకమంద గ్రామాన్ని గురువారం సందర్శించి పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సిబ్బంది కథనం మేరకు.. కనకమంద గ్రామానికి చెందిన అద్దంకి లక్ష్మి (26) 20 రోజుల క్రితం ఆమె తల్లి స్వగ్రామం ఎర్రావారి పాలెం మండలం కుమ్మరపల్లి గ్రామానికి వెళ్లింది. 15వ తేదీ జ్వరం, ఒళ్లు నొప్పులు రావడంతో ఎర్రావారి పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకుని అనంతరం ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని పచ్చకామెర్లు అని వైద్యులు చెప్పడంతో నాటు మందులు వాడింది. ఈ నెల 23వ తేదీ తిరుపతి కెఆర్ హాస్పిటల్‌లో వైద్యం తీసుకుంది. అనంతరం 24వ తేదీ చేరి రక్తపరీక్షలు చేయించుకుంది. అద్దంకి లక్ష్మికి పాజిటివ్ అని రక్త పరీక్షలలో రావడంతో వెంటనే ఆమె స్వగ్రామమైన కరకమందను వైద్య సిబ్బంది సందర్శించి నివేదికలు ఇవ్వాలని


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

జిల్లా అధికారులు అడగడంతో వైద్యాధికారి జయసింహ, సూపరువైజరు వసంత కుమార్, ఆశా కార్యకర్తలు వెళ్లి ఇంట్లో నీటిని పరిశీలించి లార్వా ఉన్న నీటిని నేలపై పోసి పైరత్రం, అబిట్ నీళ్లలో కలిపి మలాధిన్ మందును గ్రామం మొత్తం పిచికారీ చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కనకమందకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి పంచాయతీ కార్యదర్శి దివ్య భారతితో మాట్లాడారు. అనంతరం పరిసరాలు అపరిశుభ్రంగా, రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. డెంగీ పాజిటివ్ వచ్చిన అద్దంకి లక్ష్మి స్వగ్రామం కరకమంద అని చెప్పడంతో తమకు వచ్చిన సమాచారం మేరకు పారిశుధ్య పనులు చేపట్టి పిచికారీ చేయించినట్లు ఎంపీడీవో తెలిపారు. అనంతరం గ్రామంలోని


మరకమంద గ్రామాన్ని పరిశీలిస్తున్న విద్యాధికారులు

ప్రాథమి క పాఠశాలను పరిశీలించి పాఠశాల చుట్టూ తేడా దిబ్బలు ఉండడం పశువులను అక్కడే కట్టి ఉంచడాన్ని పరిశీలించి వెంటనే పారిశుధ్య పనులు చేయించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడి కి, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు.


ఎమ్మెల్యే పంపిణీ చేసిన ట్యాబ్‌లతో ఆర్‌పిలు

ఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి -పలమనేరు:
పలమనేరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేసే రిసోర్స్ పర్సన్‌లకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి గురువారం తన కార్యాలయంలో ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బ్యాంకు లింకేజీ సంఘ సభ్యులకు పారదర్శకంగా అవకతవకలు లేకుండా పర్యవేక్షించేందుకు, బ్యాంకు రుణాలు మంజూరులో ఆన్‌లైను ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. దీంతో పాటు సంఘ సభ్యుల డేటాలో మార్పులు, చేర్పులతో పాటు కొత్తగా చేరే సభ్యుల వివరాలు, సంఘ మహిళల ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో మార్కెట్ అవకాశాలు కల్పన, తదితర అంశాల నమోదుకు ట్యాబ్‌లు వినియోగించ నున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, మెప్మా మేనేజర్ బాబాతో పాటు సివోలు, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, గిరిబాబు, ఖాజా, బిఆర్‌సి కుమార్, మదన్, శ్రీధర్, భాస్కర్ పాల్గొన్నారు.


కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న నాయకులు

మహిళాభివృద్ధికి కృషి..

ప్రజాశక్తి - రామకుప్పం:
రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక, అభివృద్ధి సాధించేందుకు అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, మహిళాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని రామకుప్పం ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడ్, మాజీ రెస్కో డైరెక్టరు, నిట్ ఇన్‌ఛార్జ్, రామమూర్తి పేర్కొన్నారు. గురువారం వారు రామకుప్పం సమీపంలో గల స్త్రీశక్తి భవనంలో ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన ఉచిత శిక్షణ కుట్టు (టైలరింగ్) శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో హాజరు శాతం, స్థానికంగా కల్పిస్తున్న వసతులు వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంద్యాల మడుగు ఎంపీటీసీ నాగ భూషణం, ఏపీఎం శ్రీనివాస్ మూర్తి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి

ఐఆర్‌ఎమ్ డిగ్రీ కళాశాల అధ్యక్షులు బిఎం దయానిధి

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : ఐఆర్‌ఎమ్ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని ఐఆర్‌ఎం డిగ్రీ కళాశాల అధ్యక్షులు బి ఎం దయానిధి గురువారం ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం 25 శాతం కంటే తక్కువ ప్రవేశాలు ఉన్న కళాశాలల గుర్తింపు రద్దు అవుతుందని తెలిపారు. తమ కళాశాలలో గత మూడు సంవత్సరా లుగా ప్రవేశాలు తగ్గాయన్నారు. విశ్వవిద్యాలయ నియమ నిబంధనల ప్రకారం తమ కళాశాల గుర్తింపు రద్దు అయ్యే అవకాశం వుందని, తమ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఇతర కళాశాలలో ప్రవేశం పొందాలని ఆయన సూచించారు. ఇప్పటివరకు తమ కళాశాల అభివృద్ధికి సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి- కార్వేటినగరం : కార్వేటినగరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డీసీహెచ్‌ఎస్ అధికారిణి పద్మాంజలి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, రోగుల పట్ల స్నేహ భాగంగా మెలగాలని, డెలివరీల సంఖ్య పెంచాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అందరూ డ్యూటీ టైంకి అందుబాటులో ఉండా లన్నారు. రోగులకు మంచి పోషక ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఓపి, ఐపి, డెలివరీలు కేసులు, ఎన్టీఆర్ వైద్య సేవ వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఫార్మసీ, లేబర్ రూమ్, డైలీ రికార్డులను పరిశీలించారు.ఎన్టీఆర్ వైద్య సేవలను మెరుగుపరచాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యూసఫ్, డాక్టర్ శృతిభాగ్యం, పలువురు వైద్యులు పాల్గొన్నారు.


కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా డిసిహెచ్‌ఎస్ అధికారిణి పద్మాంజలి

27 నుంచి ద్రౌపది దేవి, ధర్మరాజుల తిరణాళ్లు

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరంలో ఈనెల 27వ తేదీ నుంచి శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి తిరణాళ్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు మేళం రవి యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 27వ తేదీన యాదవ కులస్తులచే పాండవ జననం జరుగుతుందన్నారు. 28వ తేదీ వడ్డీ కులస్తులు, 29న రజక కులస్తులు, మోపియ్యచేది విశ్వబ్రాహ్మణ కులస్తులు ఒకటవ తేదీన రెడ్డి కులస్తులు రెండవ తేదీన క్షత్రియ కులస్తులు మూడవ తేదీన కరుణిక కులస్తులు నాలుగో తరగతి తేదీన పల్లె రెడ్డి కులస్తులు, ఐదవ తేదీన తూర్పు వీధి



వారు ఆరవ తేదీన బలిజ కులస్తులు, ఏడవ తేదీన వసంతోత్సవం ఏకాంతసేవ నిర్వహించి ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు రెడ్డమ్మ భాగవతారణి చవటగుంట వారి బృందం మహాభారత హరికథ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రాత్రి 9 నుండి శ్రీ వెంకటేశ్వర కలనాటికి మండలి కే కిరణ్ కుమార్ వారి బృందం చే మహాభారత నాటక ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు కే రవి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి గౌతమ్ రాజు, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి ఆలయ పూజారి సుమన్ యాదవ్, పలువురు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన పల్లవి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నలగంపల్లి గ్రామం సమీపంలో గురువారం చోటు చేసుకుంది . ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కథనం మేరకు.. పలమనేరు మండలం, జగమర్ల గ్రామానికి చెందిన సుధాకర్ ఆయన భార్య ఇ పల్లవి (23) వీరిద్దరితో పాటు ముగ్గురు పిల్లలు బంగారుపాలెం మండలం నలగాంపల్లి సమీపంలో ఓ మామిడి తోపులో కాపలా దారులుగా పనిచేస్తున్నారు. గత ఆదివారం సుధాకర్ మద్యం తాగిరావడంతో భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. మనస్తాపం చెందిన సుధాకర్ మొదట విషపూరిత మందు తాగాడు. దీన్ని చూసి భయపడ్డ పల్లవి కూడా విషపూరిత మందు తాగింది. దీన్ని గుర్తించిన స్థానికులు ఇద్దరినీ బంగారుపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంగారపాలెంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేపడుతుండగా గురువారం పల్లవి మృతి చెందింది. భర్త సుధాకర్ ప్రమాదం నుండి కోలుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాల్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో ద్విచక్రవాహనాల దొంగలు

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

- 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం- విలువ రూ.10 లక్షలు

ప్రజాశక్తి -విజయపురం నగరి: ద్విచక్రవాహనాలను చోరీ చేసే తమిళనాడు అరక్కోణం మోసురు గ్రామానికి చెందిన పి సిలంబరసన్ అలియాస్ అరసు (40), ఎస్ అరుళ్ (38) లను నగరి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ కథనం మేరకు.. మేరకు నగరి పరిసర ప్రాంతాల్లో నాలుగునెలలుగా బైకు దొంగతనాలు పెరగడంతో ఇటీవల తమిళనాడు సరిహద్దులో వాహనాల రాకపోకలు రికార్డు అయ్యే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేశారు. గురువారం వేకువజామున అందిన సమాచారం మేరకు సీఐ, ఎస్ఐ, క్రై పార్టీ సిబ్బంది దేశమ్మ దేవాలయ ఆర్చి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గత నాలుగు నెలలుగా నగరి, పుత్తూరు, నారాయణవనం, పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిల్ దొంగతనాలు, కార్ల అద్దాలు పగలగొట్టి ప్లేయర్ల చోరీ చేసి తమిళనాడు తిరుత్తణి, కాంచీపురం పరిసర ప్రాంతాల్లో అమ్మినట్లు, కొన్ని వాహనాలు విజయపురం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద దాచి ఉంచినట్లు కనుగొన్నారు. నగరిలో 8, పుత్తూరులో 2, నారాయణవనంలో ఒకటి చొప్పున బైక్‌లు చోరీ చేయడంతో పాటు నగరి ఆర్డీవో వినియోగించే ప్రభుత్వ వాహనపు అద్దాలు పగలగొట్టి ప్లేయర్ చోరీకి ప్రయత్నించినట్లు తెలియవచ్చింది. వీరి వద్ద నుండి సుమారు పది లక్షల రూపాయలు విలువ చేసే 8 మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు. వీరిలో సిలంబరసన్ అలియాస్ అరసుపై తమిళనాడులో కేసులున్నాయి. వీరిని రిమాండ్‌కు పంపిన అనంతరం కస్టడీకి తీసుకొని ఇతర వాహనాలు, ఇతర వస్తువులు రికవరీ చేయనున్నట్లు డీఎస్పి వెల్లడించారు. నేరస్థులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరచిన నగరి, కార్వేటినగరం సీఐలు విక్రమ్, హనుమంతప్ప, ఎస్ఐ విజయనాయక్, సిబ్బంది ఇంద్రకుమార్, సత్య, గజేంద్ర, అశోక్, లోకనాథం, గణేశ్ రెడ్డి, రమేష్‌లను జిల్లా ఎస్పి, నగరి డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. రివార్డులకు సిఫారసు చేశారు.


హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

హత్యకేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- విజయపురం: ఇటీవల మండలంలోని పాత ఆర్కాడు సమీపంలో తమిళనాడు అరుంబాక్కానికి చెందిన వెంకటేశ్వన్ హత్య కేసుకు సంబంధించి నిందితుడు వెంకటేషన్(57)ను పోలీసులు గురువారం అరెస్టు చేశారని సీఐ భాస్కర్ తెలిపారు. ఆస్తి గొడవల కారణంగా ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో పాత ఆర్కాడు ఇళ్లత్తూరు మార్గమధ్యంలో రాజు కొబ్బరి తోట వద్ద హత్య చేసినట్లు గుర్తించామన్నారు. నిందితుడు ఉపయోగించిన కత్తిని, దుస్తులను స్వాధీనం చేసుకొని నిందితుడిని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ సమక్షంలో కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించామని తెలిపారు. నిందితుడిని పట్టుకుని కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్ఐ రంగా, ఏఎస్ఐ గోవిందరాజులు, సిబ్బంది సుబ్రహ్మణ్యం, నరేష్, సత్యరాజ్, మలనవాలన్, శశికుమార్, అయ్యప్ప, దామోదరం, హరిప్రసాద్, లక్ష్మయ్యను డిఎస్‌పి అభినందించారు.

డ్రగ్స్ బారినపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



పలమనేరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -పలమనేరు: డ్రగ్స్ బారిన పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించు కుని పలమనేరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం యువతకు అవగాహన కలిగించారు. మాదకద్రవ్యాలకు దూరంగా సంతోషకర మైన సమాజానికి కృషి చేస్తామని యువత వద్ద ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అలవాటు కారణంగా కుటుంబాలు వీధిన పడి



ద్రావిడ యూనివర్సిటీ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

నాశన మవుతున్నా యన్నారు. అనంతరం జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డిఎస్‌పి డేగల ప్రభాకర్, సీఐలు నరసింహరాజు, మురళి, ప్రసాద్, ఎస్ఐలు స్వర్ణ తేజ, లోకేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎమెనో అతిథి గృహంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ దినోత్సవం సందర్భం గా విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఎమ్ దొరస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే జాగరూకులై మాదకద్రవ్యాలకు దూరంగా వుండాలని, వాటికి బానిస కావద్దని సూచించారు. డీన్ అకడమిక్ అఫైర్సు ఆచార్య శ్యామల మాట్లాడు తూ డ్రగ్స్ వాడకం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని యువత గుర్తించి బాధ్యతగా జీవించా లన్నారు. ఎక్సైజ్ సీఐ ఎ నాగరాజు డ్రగ్స్ తీసు కున్న ఎంతటి వారినైనా శిక్షిస్తామని హెచ్చరిం చారు. లా అండ్ ఆర్డర్, సీఐ కుప్పం (రూరల్) జె మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ నేటి సమాజంలో పోక్సో కేసులు ఎక్కువగా వస్తున్నాయని, దాదాపు పది పోక్సో కేసులు వస్తే వాటిలో ఎక్కువ కేసులు గంజాయి తీసుకున్న వారే వున్నారన్నారు. గంజాయి అమ్మినా, పండించినా తమకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆర్ యశోద , ప్రోగ్రామింగు ఆఫీసర్సు డాక్టరు బి శ్రీనివాస్, డాక్టరు ఎమ్ హరికృష్ణ, డాక్టరు టి శోభ, డాక్టరు టి వెంకటస్వామి, అధ్యాప కులు, అధ్యాపకేతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐ

గంగాధర నెల్లూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దానివల్ల జీవితాలు నాశనమవుతుందని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని గంగాధర నెల్లూరు సిఐ శ్రీనివాసంతి తెలిపారు. మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ సీఐ శ్రీనివాసంతి ర్యాలీ నిర్వహించి విద్యార్థుల వద్ద ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుల్ గోపి, పోలీస్ సిబ్బంది శరత్, నాగేంద్ర, కిషోర్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు అంధకారమవుతుందని అపోలో మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయ ప్రియ అన్నారు. చిత్తూరు అపోలో యూనిర్సిటీలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వి నియోగం- అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రియ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్య అని దీనిపై అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, సీనియర్ ప్రొఫెసర్ భాస్కర్‌నాయుడు, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ కార్వేటినగరం మండలంలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నుంచి పోలీస్ స్టేషన్ వరకు విద్యార్థులతో సిఐ హనుమంతప్ప, ఏఎస్ఐ మునికృష్ణ పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ హనుమంతప్ప మాట్లాడుతూ విద్యార్థి దశలోనే గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాల అలవాటుతో జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని, డ్రగ్స్ అలవాటును మానుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, ప్రజలు బాధ్యతగా డ్రగ్స్ వాడకాన్ని గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని అందించాలని సీఐ హనుమంతప్ప పేర్కొన్నారు.

అనధికార స్టిక్కర్లు వినియోగిస్తే చర్యలు: సీఐ



ప్రజాశక్తి -వెదురుకుప్పం: కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై 'ప్రెస్', 'పోలీస్' అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రెస్, పోలీస్' విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోవడం చట్ట విరుద్ధమని సంబంధిత గుర్తింపు కార్డులు లేకుండా తిరిగే వారి వాహనాలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీ చేస్తామని నిబంధన లు ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరిం చారు. కొందరు అనధికారికంగా వాహనాలకు సైరన్లు బిగించి ధ్వని కాలుష్యానికి, తోటి వాహనదారు లకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులుపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు..

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE OF PALAMANER CAMP COURT AT KUPPAM
A.S. NO. 4 OF 2015
O.S. NO. 20 OF 2020

Between:
1. K.U. Inayathulla
2. Smt. Nayaz Begum ...APPELLANTS

And:

Hidayathulla and others ...RESPONDENTS

NOTICE TO RESPONDENTS 6 TO 11

6. Smt. Tahera 62 years
7. Smt. Shakira aged 60 (died) about one month ago) legal heirs particulars not known
8. Smt. Muneera aged 56 years
9. Smt. Najeera aged about 54 years
10. Smt. Manju aged about 53 years
11. Smt. Parveen aged about 50 years

Respondents 6 to 11 are daughters of 5th respondent and T.R. Rahamatulla and care of first respondent Hidayatulla residing at D.No. 12/24, Prakasham Road, Kuppam.

The appellants filed appeal and impleaded you in the appeal. You are hereby summoned by this court to appear either in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the appeal, on 30/06/2025at 10-30 o'clock, to answer the claim; and as the day fixed for your appearance is appointed for the final disposal of the appeal, In default of your appearance on the day matter will be heard and determined in your absence.

// By Order of Court //
K. UDAYA KUMAR, B.A
ADVOCATE, KUPPAM-517 425, A.P.
#14-159, RAILWAY STATION ROAD
KUPPAM-517 425, CHITTOOR-DT.,A PH: 9440449496, 9959369475
Email: udaykuppam91@gmail.com